పోలీస్ కుటుంబాలకు నేత్ర వైద్య శిబిరం

శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, మార్చి 5: పోలీస్ కుటుంబాల కోసం నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ కల్యాణ మండపంలో బుధవారం వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరాన్ని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ప్రారంభించారు. 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరం.. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుంది. ఏఆర్ ఏసీపీ నర్సయ్య, డాక్టర్ శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలాఖరుకు పనులు పూర్తికావాలి
అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

బోనకల్లులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, మార్చి 5: పీఎం శ్రీ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ప్రతిపాదించిన పాఠశాల అభివృద్ధి పనులను మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. ఈ పనులపై ఆమె బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. పీఎం శ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులకు రూ.1.65 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. వీటిని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. ప్రతి పనికి ఎంబీ రికార్డులను తయారు చేసి బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఈవో సోమశేఖర శర్మ, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, ఏఎంవో రవికుమార్, జీసీడీవో తులసి, ఎంఈఈవోలు, ఈఈలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలి

బోనకల్లు, మార్చి 5: ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని గార్లపాడును పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేశారు. ఈ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు గ్రామసభల ద్వారా ఎంపిక చేశారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారుల స్థలాలను ఆమె పరిశీలించారు. ఇంటి నార్మణం కోసం వెంటనే మార్కింగ్ చేసుకొని పనులు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీను పరిశీలించారు.

మిస్ట్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్, మార్చి 5: బీటెక్ పరీక్షా ఫలితాల్లో సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ బుధవారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

సత్తుపల్లిటౌన్, మార్చి 5: వ్యవసాయ, విద్యా రుణాలు, గేదెల రుణాలు, ముద్ర రుణాలు, మార్ట్‌గేజ్ రుణాలు పొందిన వారు సకాలంలో చెల్లించాలని సత్తుపల్లి డీసీసీబీ మేనేజర్ జీ.కిశోర్, శివసత్యనారాయణ, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.శ్రీనివాసరావు, ఏజీఎం ప్రవీణ్ కోరారు. బుధవారం సత్తుపల్లిలో రుణాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ రుణాలు పొందిన వారు ఏడాది లోపు రెన్యూవల్ చేయడం ద్వారా 7 శాతం మాత్రమే వడ్డీ పడుతుందని, నిర్ధిష్ట తేదీ లోపు చెల్లించిన వారికి తిరిగి 3 శాతం వారి ఖాతాకు జమ వుతుందని తెలిపారు. ఖాతాదారులందరూ అవగాహన పెంచుకొని సరైన సమయంలో రుణాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జనార్ధన్, రాకేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కూసుమంచి, మార్చి 5: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన ఘటన కూసుమంచి మండలం గట్టుసింగారం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపి వివరాల ప్రకారం.. గట్టుసింగారం గ్రామానికి చెందిన తోడేటి నరేష్ (24) వ్యవసాయ, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 27న సాయంత్రం కూసుమంచి నుంచి గట్టుసింగారం వెళ్తుండగా బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కాగా కుటుంబసభ్యులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ నరేశ్ బుధవారం మృతిచెందాడు. మృతుడి నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో ఖమ్మం నేత్ర నిధికి దానం చేశారు. కూలీ పనుల కోసం వెళ్లే కుటుంబం అయినప్పటికీ కొడుకు నేత్రాలతో మరొకరికి చూపు వస్తుందని గుర్తించి ముందుకు రావడం పట్ల పలువురు తల్లిదండ్రులను అభినందించారు. నరేశ్ మృతి పట్ల మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణ రెడ్డి, గట్టుసింగారం నాయకులు పరశురాం, వీరభద్రం, సుధారాణి, కాంతారావు, ఖాదర్ బాబా, యాదవ సంఘం నాయకులు మేకల మల్లిబాబు యాదవ్, తొడేటి లింగరాజు సంతాపం తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కూసుమంచి ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రచ్ సెంటర్‌ను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి
కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

క్రచ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

మామిళ్లగూడెం, మార్చి 5: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లోగల క్రచ్ సెంటర్‌ను పిల్లలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని సిబ్బందికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. దీనిని ఆయన బుధవారం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి పరిశీలించారు. రోజువారీగా ఎంత మంది పిల్లలు ఉంటున్నదీ, వారికి అందిస్తున్న సేవలు తదితరాంశాలను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. ఎండలు పెరుగుతున్నందున ఏసీ ఏర్పాటు చేయాలని, తలుపు మూసినప్పుడు చీకటిగా ఉండకుండా సెమీ ట్రాన్స్‌పరెంట్ డోర్ ఏర్పాటు చేయాలని, పిల్లలు బయటకు వెళ్లకుండా చిన్న గేట్ ఏర్పాటు చేయాలని, ఆట వస్తువుల ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ, క్రచ్ ఇన్‌చార్జ్ రాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు హెల్ప్ డెస్క్

మామిళ్లగూడెం, మార్చి 5: జిల్లాలోని దివ్యాంగులు గౌరవప్రదమైన జీవనం గడిపేలా కృషి చేస్తున్నామని, వారికి ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. యూనిక్ డిజెబిలిటీ ఐడెంటిటీ కార్డ్(యూడీఐడీ) పొందే విధానంపై దివ్యాంగులకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ కార్డులు త్వరలోనే స్పీడ్ పోస్ట్ ద్వారా ఇంటి చిరునామాకు వస్తాయన్నారు. దివ్యాంగుల కోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ నియామకాల్లో దివ్యాంగులకు అవకాశమిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం అన్ని మండలాల్లోని తహసీల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దివ్యాంగుల ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా స్థాయిలో దివ్యాంగుల సమన్వయ కమిటీని పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసే 'స్త్రీ టీ షాపు'ల్లో దివ్యాంగ మహిళలకు 50 శాతం కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

'సదరం' స్థానంలో యూనిక్ ఐడీ

దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లకు బదులుగా యూనిక్ ఐడీ కార్డులు జారీ చేయనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ చెప్పారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ఇవి ఇతర రాష్ట్రాల్లో కూడా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్డుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్ ఉన్న వారికి డీఆర్‌డీఏ ద్వారా యూనిక్ ఐడీ కార్డుల జారీ చేస్తామన్నారు. డీఆర్‌వో పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా సంక్షేమ శాఖాధికారి రాంగోపాల్‌రెడ్డి, డీఈవో సోమశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాకాశితండా వరద బాధితులు

మంత్రి పొంగులేటి గారూ..
మాకిచ్చిన హామీలను అమలు చేయండి..
తహసీల్దార్‌కు రాకాశితండా వరద బాధితుల వినతి

తిరుమలాయపాలెం, మార్చి 5: 'మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారూ.. మా గ్రామం ఆకేరు వరద ప్రవాహానికి గురైన సమయంలో మాకిచ్చిన హామీలను అమలు చేయండి సారూ..' అంటూ తిరుమలాయపాలెం మండలంలోని రాకాశితండా ముంపు బాధితులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ రామకృష్ణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'గత వర్షాకాలంలో ఆకేరు ప్రవాహంలో మా తండా ముంపునకు గురైనప్పుడు తమరు మా తండాను పరిశీలించారు. మరోసారి ఇలా ముంపునకు గురి కాకుండా ఉండేందుకు మా తండా మరో ప్రాంతానికి తరలిస్తామని, ఇళ్ల స్థలాలతోపాటు ఇళ్లు ఇస్తామని ఆనాడు హామీ ఇచ్చారు. కోతకు గురైన భూములను బాగు చేసుకునేందుకు ఇస్తామన్న నష్టపరిహారాన్ని కూడా చెల్లించలేదు. వరదకు తడిచిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పి కూడా చేయలేదు. ఇళ్లు, పంటలు కొట్టుకపోయిన బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. ఆరు నెలలైనా మీరిచ్చిన హామీలు అమలుకాలేదు. ఇప్పటికైనా మా బాధలు తీర్చండి సారూ..' అంటూ వేడుకున్నారు. తండా వాసులు, సీపీఎం నాయకులు కొమ్ము శ్రీను, జరుపుల లీల, బోడ మోహన్, బాబురావు, సుజాత, సహదేవ్, మహేందర్ పాల్గొన్నారు.

కేఎంసీ అటెండర్ ఆత్మహత్యాయత్నం
అకారణంగా బదిలీ చేశారంటూ మనస్తాపం
బదిలీ చేసిన చోట చేరలేదంటున్న కమిషనర్

ఖమ్మం, మార్చి 5: ఖమ్మం నగర పాలకసంస్థ (కేఎంసీ) కార్యాలయ అటెండర్ డీ.మాధవి కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ ఎదుట బుధవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ విషయాన్ని గమనించిన కేఎంసీ సిబ్బంది.. ఆమెను 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. బాధితురాలి కథనం ప్రకారం.. డీ.మాధవి 20 ఏళ్లుగా కేఎంసీలో అటెండర్‌గా పనిచేస్తోంది. హెల్త్ వర్కర్‌గా విధుల్లో చేరిన ఆమెను.. గతంలో పనిచేసిన మేయర్ బలవంతంగా అటెండర్‌గా బదిలీ చేశారు. అప్పటి నుంచి ఆమె అటెండర్‌గానే విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 6న ఆమెను అటెండర్ విధుల నుంచి తప్పించి పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా విధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ప్రస్తుత తన ఆరోగ్య పరిస్థితుల రీత్యా ఆ విధులను నిర్వర్తించలేనని, అటెండర్‌గానే విధులు నిర్వహించుకునేలా అవకాశం కల్పించాలని కమిషనర్‌ను, మేయర్‌ను కోరారు. దీంతో అటెండర్‌గానే డ్యూటీ చేసువాలని వారు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆమె అటెండర్‌గానే విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ హెల్త్ వర్కర్‌గా ఎందుకు వెళ్లడం లేదంటూ పలుమార్లు ఆమెకు సంజాయిషీ నోటీసులు, షోకాజ్ నోటీసులు అందాయి. వాటికి ఆమె సమాధానం ఇచ్చారు. అయినప్పటికీ తాము ఇచ్చిన ఉత్తర్వులను పాటించడం లేదంటూ, మెమోలకు జవాబు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ కమిషనర్ పేరుతో గురువారం సెస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శుక్రవారం ఉదయం ఆ ఉత్తర్వులను అటెండర్ ఇంటికి సిబ్బందితో పంపించారు. అయితే, నోటీసులకు, మెమోలకు తాను సమాధానం ఇచ్చినప్పటికీ తనను సస్పెండ్ చేశారంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే విషయాన్ని కమిషనర్‌కు చెప్పేందుకు శుక్రవారం ఆమె కమిషనర్ కార్యాలయానికి వెళ్లింది. కానీ కమిషనర్ అపాయిమెంట్ ఇవ్వలేదు. వారం రోజుల తరువాత కలవాలని తన సీసీ ద్వారా సమాచారం అందించారు. బుధవారం మరోసారి వెళ్లినా కమిషనర్ టైం ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెంది కమిషనర్ చాంబర్ ఎదుటే నిద్రమాత్రలు మింగింది.

ఆమె స్పందించకపోవడం వల్లనే సస్పెండ్ చేశాం: కమిషనర్

ఈ విషయంపై కమిషనర్ స్పందిస్తూ.. అటెండర్ మాధవిని సస్పెండ్ చేసిన విషయం వాస్తవమేనని అన్నారు. సంబంధిత శాఖలో ఆమె జాయిన్ కాలేదని, ఆ విషయాన్ని తమకు చెప్పలేదని అన్నారు. నోటీసులకు, మెమోలకు నెలన్నర రోజులుగా ఆమె నుంచి స్పందనలేక పోవడంతోనే సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, రెండు మూడు రోజుల తరువాత గైడ్ చేస్తామని సమాధానమిచ్చారు.

12 నుంచి 'యువ పార్లమెంట్' పోటీలు

ఖమ్మం అర్బన్, మార్చి 5: వికసిత్ భారత్ యువ పార్లమెంట్ జిల్లా స్థాయి పోటీలకు నోడల్ సెంటర్‌గా నగరంలోని కవిత మెమోరియల్ కళాశాల ఎంపికైందని ప్రిన్సిపాల్ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని 18 నుంచి 25 సంవత్సరాల లోపు యువతీ యువకులు భారత్ పోర్టల్‌లో 9 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

బోనకల్‌కు నేడు ప్రత్యేక బస్సులు

ఖమ్మం, మార్చి 5: చింతకాని మండలం పొద్దుటూరు గ్రామంలో గురువారం జరిగే బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠాపన మహోత్సవానికి వెళ్లి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం నుంచి కొణిజర్ల, పొద్దుటూరు మీదుగా బోనకల్ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ ఖమ్మం డిపో మేనేజర్ పి.దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పాత బస్టాండ్ నుంచి ఉదయం 9:30, మధ్యాహ్నం 12:30, సాయంత్రం 3:30, 6:30 గంటలకు ఈ బస్సులు ఉంటాయని వివరించారు. బోనకల్ నుంచి ఖమ్మం పాత బస్టాండుకు ఉదయం 8.00, 11.00, మధ్యాహ్నం 2.00, రాత్రి 8.00 గంటలకు బస్సులు బయల్దేరతాయని తెలిపారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

రామాలయానికి శాశ్వత నెలవారీ వితరణ

కూసుమంచి, మార్చి 5: కూసుమంచి మండలం గోరీలపాడు తండాలో రాతి కట్టడంతో నిర్మిస్తున్న నూతన రామాలయానికి ప్రతీ నెల పూజారి కోసం నెలకు రూ.5 వేలు ఇస్తామని తండాకు చెందిన బాణోత్ చందానాయక్-జమున దంపతులు ప్రకటించారు. ఆలయ నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన వీరు నిత్య నైవేద్యానికి కూడా వితరణ ఇవ్వడం పట్ల తండాలో గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

కారేపల్లి, మార్చి 5: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం పార్టీ పోరాడుతుందని వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. సీపీఎం సింగరేణి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో అలసత్వం వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను చైతన్య పరిచి పోరాడుతుందన్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య

రఘునాథపాలెం, మార్చి 5: మద్యానికి డబ్బు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాలు.. రామన్నపేటకు చెందిన సెంట్రింగ్ కార్మికుడు షేక్ ఖాసీం, మద్యానికి బానిసగా మారాడు. కొన్నాళ్ల నుంచి పనులకు వెళ్లడం లేదు. అతడు మంగళవారం రాత్రి మద్యం కోసం భార్యను డబ్బు అడిగాడు. తన వద్ద లేవని ఆమె చెప్పింది. దీంతో అతడు బెడ్ రూమ్‌లోకి వెళ్లి, సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య ఫర్జానా ఫిర్యాదుతో కేసు నమోదైంది.

వైరా మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

వైరాటౌన్, మార్చి 5: వైరా మండలం సిరిపురం కేసీ ఉన్నత పాఠశాలలో సిరిపురం గ్రామ వాస్తవ్యులు గర్భిణులకు ఉచిత ఆటో సర్వీస్ నిర్వహిస్తున్న షేక్ లతీఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులను వైరా మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ని శాలువాతో సన్మానించంఆరు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, పాఠశాల సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ఖమ్మం రూరల్, మార్చి 5: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డు సమీపంలో దండి భాస్కర్ జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం సీపీఐ నాయకుడు దండి భాస్కర్ ప్రారంభించారు.

పోస్టాఫీసు, లైబ్రరీని సందర్శించిన విద్యార్థులు

పెనుబల్లి, మార్చి 5: స్థానిక శ్రీవేద పాఠశాల విద్యార్థులు బుధవారం పెనుబల్లి గ్రామంలో ఉన్న పోస్టాఫీసు, లైబ్రరీను సందర్శించారు. వాటి ప్రాముఖ్యత గురించి పోస్ట్‌మాస్టర్ శేషగిరిరావు, లైబ్రరీయన్ మల్లికార్జునరావు విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ ఫీల్డ్ సర్వే

బోనకల్లు, మార్చి 5: మండల కేంద్రంలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న స్థలాలను తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ బుధవారం పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులో పొందుపరిచిన 29/బీ సర్వేలోని స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపాలరెడ్డి విజయంపై సంబురాలు

బోనకల్లు, మార్చి 5: నల్గొండ- వరంగల్- ఖమ్మం పీఆర్‌టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాలరెడ్డి ఎమ్మెల్సీగా విజయం సాధించడంతో బుధవారం బోనకల్లులో పీఆర్‌టీయూ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు పేల్చి, మిఠాయిలు పంచారు. అంకితభావంతో తమ ఎమ్మెల్సీ శ్రీపాలరెడ్డి అంకితభావంతో పనిచేస్తారని స్పష్టం చేశారు.

మున్సిపాలిటీతో పాలన మరింత సౌలభ్యం

ఖమ్మం రూరల్, మార్చి 5: పంచాయతీలతో పోలిస్తే మున్సిపాలిటితో పరిపాలన మరింత సౌలభ్యమవుందని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వీలీన 12 పంచాయతీలకు సంబంధించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాయల వర్ధంతిని జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం, మార్చి 5: ఈ నెల 8, 9 తేదీల్లో మండలంలోని పిండిప్రోలు, ఖమ్మంలో జరిగే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి స్వర్గీయ రాయల రవన్న, డివిజన్ నాయకులు స్వర్గీయ రాయల నాగేశ్వరావు వర్ధంతి సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు తిమ్మడి హనుమంతరావు కోరారు. మండలంలోని బచ్చోడులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు.

ఖమ్మం రూరల్, మార్చి 5: ఈ నెల 9వ తేదీన ఖమ్మం నగరంలో జరిగే రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు బందెల వెంకయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని యం వెంకటయపాలెంలో గోడ పత్రికను ఆవిష్కరించారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

బోనకల్లు, మార్చి 5: మండల కేంద్రంలోని శాంతి నిలయంలో మానసిక వికలాంగులకు క్షయవ్యాధి మోంటాక్స్ పరీక్షలను జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ వరికూరి సుబ్బారావు వారి సొంత ఖర్చులతో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వమే పూర్తిగా మందులు అందజేస్తుందని తెలిపారు.

బీటెక్ ఫలితాల్లో 'బొమ్మ' ప్రతిభ

ఖమ్మం అర్బన్, మార్చి 5: జేఎన్‌టీయూహెచ్ ప్రకటించిన బీటెక్ 3వ సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని బొమ్మ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్ఈ ఏఐ ఎంఎల్ విభాగంలో ప్రసూన 87.11 శాతం, సీఎస్ఈలో పూజిత 85.7 శాతం, లిఖిత 83.8 శాతం, ఎలక్ట్రానిక్స్‌లో మౌనిక 85.7 శాతంతో సత్తా చాటారని వివరించారు. మరికొందరు విద్యార్థులు 80 శాతానికి పైగా మార్కులతో రాణించారని పేర్కొన్నారు. వీరిని చైర్మన్‌తోపాటు వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, సెక్రటరీ ఊదారు శ్రీధర్ అభినందించారు.

యూబీఐ ఆధ్వర్యంలో వాకదాన్

వాకదాన్‌లో అధికారులు, సిబ్బంది

రఘునాథపాలెం, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) అధికారులు, సిబ్బంది బుధవారం ఖమ్మంలో వాకదాన్ నిర్వహించారు. ఖమ్మం రీజియన్ హెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నారీ శక్తి పథకం ద్వారా మహిళలకు రుణాలు ఇస్తున్నట్లు, మహిళలను చైతన్యపరిచేందుకు వివిధ రూపాల్లో కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. నగరంలోని పార్క్ కన్వెన్షన్ హాల్‌లో ఖాతాదారులకు ఎంఎస్ఎంఈ రుణాలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఏజీఎం సర్వేశ్, సుధాకర్, చీఫ్ మేనేజర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం
నమస్తే కథనంపై చర్చ, స్పందన

బాధిత మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఖమ్మం రూరల్, మార్చి 5: మండలంలోని ఫైలట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక కాబడిన ఆరెంపుల గ్రామంలోని మంజూరైన ప్రతి లబ్ధిదారుడికి ఇళ్లు నిర్మిస్తామని ఎంపీడీవో ఎస్ కుమార్ అన్నారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో నమ్మి కూల్చుకుంటే నట్టేట ముంచారు అనే కథనం బుధవారం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో జిల్లా యంత్రాంగం స్పందించింది. బాధిత మహిళలకు తగిన న్యాయం చేయాలని మౌఖిక ఆదేశాలు రావడంతో బాధిత మహిళకు ఎంపీడీవో కార్యాలయం నుంచి ఉదయం పిలుపువచ్చింది. కొప్పుల రాజేశ్వరీ, చిర్రా రాజ్యం కుటుంబ సభ్యులు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవోను కలిశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. ఆదర్శ గ్రామం ఆరెంపులలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరి చేసిందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. తానే స్వయంగా రెండు రోజుల్లో గ్రామానికి వచ్చి మీ ఇండ్లకు ముగ్గులు పోయించి, జియో ట్యాగింగ్ చేస్తామని హామీ ఇచ్చారు. తమకు న్యాయం జరిగే విధంగా చొరవ చూపిన నమస్తేకు బాధిత మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్సిడీ రుణ లబ్ధిదారుల ఎంపిక

తిరుమలాయపాలెం, మార్చి 5: వికలాంగుల సబ్సిడీ రుణ లబ్ధిదారులను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. మండలంలో ఒక్క యూనిట్ ఉండగా 163 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ముగ్గురిని డ్రా ద్వారా ఎంపిక చేశారు. ముగ్గురి పేర్లను జిల్లా అధికారులకు పంపించగా ఒక్కరిని ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో షేక్ శిలార్ సాహెబ్ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ శారద, సీడీపీవో కవిత, ఏపీఎం వెంకటే